క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు చాగలమర్రి విద్యార్థి



ఫరీద్‌బాషా

చాగలమర్రి: అండర్‌–17 స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఫరీద్‌బాషా ఎంపికైనట్లు హెచ్‌ఎం. కోటయ్య తెలిపారు. విద్యార్థి ఫరీద్‌బాషాను సోమవారం ఎస్‌ఎంసీ చైర్మన్ గౌస్‌మోహిద్దీన్, పీడీ దాదాపీర్, ఉపాధ్యాయులతో కలిసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 1న జిల్లా కేంద్రంలోని కేఎస్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ కనబరచి సోమవారం (7వ తేదీ) నుంచి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.

డీఎల్‌డీఓగా శివారెడ్డి



నంద్యాల(అర్బన్): నంద్యాల డీఎల్‌డీఓగా శివారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మురళీ కల్యాణి అనంతపురం జిల్లా ధర్మవరం బదిలీకాగా, అక్కడి నుంచి బదిలీపై నంద్యాలకు వచ్చిన శివారెడ్డికి ఎంపీడీఓ సుగుణశ్రీతో పాటు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

స్త్రీ నిధి రుణాల పంపిణీ



స్త్రీ నిధి రుణాల వసూళ్లపై సమీక్ష చేస్తున్న ఏజీఎం

శిరివెళ్ల: జిల్లాలో రూ.53 కోట్ల స్త్రీ నిధి రుణాలను పంపిణీ చేసినట్లు స్త్రీ నిధి విభాగం ఏజీఎం ప్రసాదు తెలిపారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8.50 కోట్ల పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు. వాటి వసూళ్ల కోసం సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.125 కోట్ల రుణాలను పంపిణీ చేయాల్సి ఉండంగా సెప్టెంబర్ చివరి నాటికి రూ.53 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. శిరివెళ్ల మండలంలో రూ.6 కోట్ల రుణాలు పంపిణీ చేయాల్సి ఉండగా ఇంత వరకు రూ.1.92 కోట్ల రుణాల పంపిణీ చేశామన్నారు. సమావేశంలో ఆళ్లగడ్డ క్లస్టర్ స్త్రీ నిధి మేనేజర్ పారూఖ్, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నంద్యాల(అర్బన్): రైతు సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మైనారిటీ, న్యాయ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. 25 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తున్న శనగలను రబీ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన రాయితీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఏఓ మురళీకృష్ణ, ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు

ఉయ్యాలవాడ: మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.2.50 కోట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీల్లో ఈనెల 11న అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: పట్టణంలోని రామలక్ష్మికొట్టాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హుసేన్‌పీరా(40) కోలుకోలేక మృతి చెందాడు. రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. వెంటనే స్థానిక వైద్యశాలకు తరలించగా ప్రథమిక చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పట్టణ సీఐ చిరంజీవి తెలిపారు.

రేపటి లోపు దరఖాస్తు చేసుకోండి

చాగలమర్రి: ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణకు ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆళ్లగడ్డ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.క్రిష్ణమూర్తి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతూ ఆళ్లగడ్డ సర్కిల్ పరిధిలోని 19 దుకాణాలకు ఇప్పటి వరకు 84 దరఖాస్తులు అందాయన్నారు. సమావేశంలో ఎస్‌ఐ రమేష్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్‌ఐ వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

తెలుగంగ కాలువలో మృతదేహం లభ్యం

చాగలమర్రి: మండలంలోని భైరవగుండాల సమీపంలో తెలుగంగ ప్రధాన కాలువలో ఆదివారం ప్రమాద వశాత్తూ గల్లంతైన నరేష్(35) మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమైనట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా రాజుపాలెం మండలం యలవలి గ్రామానికి చెందిన నరేష్ మైదుకూరులోని చోళమండలం ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉత్తరం.. మధుర జ్ఞాపకం



- స్మార్ట్ ఫోన్ల రాకతో కనుమరుగు
- పోస్ట్ బాక్స్‌లు వెలవెల
- నేటి నుంచి తపాలా వారోత్సవాలు



ఆర్‌ఎస్ రోడ్డులోని ఉన్న సబ్ పోస్టాఫీసు



వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

జిల్లాలో తపాలా కార్యాలయాలు..	
హెడ్ పోస్టాఫీసు	- 01
సబ్ పోస్టాఫీసులు	- 48
బ్రాంచ్ పోస్టాఫీసులు	- 284

నంద్యాల(న్యూటౌన్): తోకలేని పిట్ట ఎగరలేకపోతోంది.. 20 ఏళ్ల క్రితం ఎంతో ఆదరణ పొందిన, నిత్యజీవితంలో భాగమైన ఉత్తరం కనుమరుగైంది. ఎంతలా అంటే..నేటి తరానికి ఉత్తరం ఎలా ఉంటుందో కూడా తెలియనంతగా దూరమైంది. సాంకేతిక పెరగడం, సెల్‌ఫోన్ వినియోగం విస్తృతమవడంతో ఉత్తరం మరుగున పడిపోయింది. సమాచారం తెలుసుకోవడానికి, పంపడానికి ఉత్తరం ద్వారా రోజుల తరబడి సమయం పట్టేది. నేడు క్షణాలో చేరవేస్తున్నారు. దీంతో ఉత్తరానికి ఆదరణ తగ్గి టెక్నాలజీ విస్తృతమైంది. గతంలో పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో శుభాకాంక్షలు తెలుపుకోవడానికి, యోగక్షేమాలు, సమాచారం చేరవడానికి ఉత్తరం మధ్యవర్తిత్వం వహించేది. ఉత్తరం ద్వారానే వివరాలు తెలిసేవి. నాడు లేఖను ఆసక్తి చదివేవారు. ఇక ఉత్తరం రాయడంలో కొందరి శైలి చదివించేలా చేసేది. దీంతో రాతకు కూడా ప్రాధాన్యత ఉండేది. తమకు వచ్చే లేఖలను ఆసక్తిగా చదువుకుని భద్రంగా దాచుకునేవారు ఎందరో. గుర్తు వచ్చినప్పుడు వాటిని తీసి చదువుకుని తీపి జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు.

స్మార్ట్ ఫోన్ల జోష్..

స్మార్ట్ ఫోన్ జోష్‌తో లేఖల మనుగడకు ముప్పు వచ్చింది. 24 గంటలూ స్మార్ట్ ఫోన్లతో అరకొర సందేశాలు పంపడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్న విద్యార్థులు, యువత ఉత్తరాల ప్రాధాన్యాన్ని, అందులోని ఆనందాన్ని తెలుసుకోలేకపోతోంది. సాంకేతికత విరాజిల్లుతోన్న ఈ రోజుల్లో పాత జ్ఞాపకాల సంగతి పక్కన పెడితే, ఎలాంటి సమాచారానైనా క్షణాల్లో చేరుతుందనేది కొందరి వాదన. అప్పట్లో ఉత్తరాలు పోస్ట్ చేస్తే నాలుగైదు రోజుల తర్వాత చేరేవి. కానీ ప్రస్తుతం క్షణాల్లోనే సమాచారం వస్తోంది కదా! అని చెబుతున్నారు. మనియార్డర్ (ఎంఓ) మనుగడ కరువైంది. ఫోన్‌పే, గూగుల్ పే వంటి సౌకర్యాలతో ఎంఓ వినియోగం కనుమరుగైంది.

పోస్టల్ పథకాలు..

తపాలా కార్యాలయాల్లో ప్రస్తుతం రూ.2.35 విలువ గల పోస్టు కార్డును సామాన్యుల కోసం రూ.0.50కి విక్రయిస్తున్నారు. ఇన్లాండ్ కవర్ రూ.2.50, ఎన్వలప్ రూ.5 (20 గ్రాముల వరకూ), అదనంగా ప్రతి 20 గ్రాములకు రూ.5 స్టాంప్ జత చేయాలి. ఆమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర సౌకర్యాల తరహాలో పోస్టల్ శాఖలో పార్శిల్ డైరెక్టరేట్ సౌకర్యం ఉంది. రిజిస్టర్డ్ న్యూస్ పేపర్ రూ.0.25కు బట్వాడా. బుక్‌పోస్ట్ 50 గ్రాముల వరకూ రూ.4 ధర నిర్ణయించారు. నిర్ణీత సమయానికి చేరవేసే స్పీడ్ పోస్ట్ సౌకర్యం వంటివి తపాలా శాఖలో ఉన్నాయి. పిల్లల నుంచి వయో వృద్ధుల వరకూ ప్రయోజనకర డిపాజిట్ పథకాలు ఉన్నాయి.

తపాలా వారోత్సవాల్లో ఇలా...

- ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు తపాలా వారోత్సవాలు నిర్వహించాలని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ రీజినల్, డివిజన్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. రీజినల్, డివిజనల్, హెడ్ పోస్టాఫీసుల్లో పలు కార్యక్రమాలు నిర్వహిరు. మెయిల్స్ అండ్ పార్శిల్ దినోత్సవం. వంద శాతం లక్ష్య సాధనకు పోస్ట్‌మెన్, డెలివరీ స్టాఫ్‌కు అవగాహన, కస్టమర్ మీట్ నిర్వహిస్తారు.
- 8న పిలాటెలి దినోత్సవం. ఆ రోజు ఫిలాటెలి ఖాతాలు, స్టాంప్స్ సేకరణ హాబీపై అవగాహన నిర్వహిస్తారు.
- 9న ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా పోస్టాఫీస్ వద్ద నేషనల్ పోస్టల్ వీక్ 2024 బ్యానర్ల ప్రదర్శన, ర్యాలీ నిర్వహిస్తారు.
- 10న అంత్యోదయ దివస్. పేదలు ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా చైతన్యవంతులను చేస్తారు.
- 11న విటియా సశక్తికరన్ దివస్ సందర్భంగా బాలికలకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తారు. అర్హులైన బాలికలకు సుకన్య సమృద్ధి యోజన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వారోత్సవాలకు సమాయత్తం



ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 11వ తేదీ వరకు రోజుకొక కార్యక్రమం నిర్వహిస్తాం. డివిజన్‌లోని అన్ని పోస్టాఫీస్‌ల్లో వారోత్సవాలు చేపడతాం. ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రజాప్రయోజన పథకాలు, ఇన్సూరెన్స్ స్కీమ్‌లు, కొత్త పాలసీల సేకరణ, పాలసీల పునరుద్ధరణ, పెండింగ్ క్లెమ్‌లను పరిష్కరిస్తారు.
– శ్రీనివాసరావు, పోస్టల్ సూపరింటెంట్, నంద్యాల

గొప్ప సంస్కృతి



లేఖలు రాయడం గొప్ప సంస్కృతి. మనం చెప్పాలనుకున్న విషయాలు, ఆలోచనలు, భావాలను ఫోన్ల ద్వారా చెప్పడం కన్నా ఉత్తరాల్లో చక్కగా రాసి పంపవచ్చు. నా స్నేహితులు పంపిన ఉత్తరాలు నేటికీ పదిలంగా దాచుకున్నా.
– రమణయ్య, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు, నంద్యాల

సాంకేతికత పెరగడంతో..



ఉత్తరం అద్భుతమైన జ్ఞాపకం. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగే కొద్దీ కలం, కాగితాన్ని పక్కన పెట్టి స్మార్ట్ ఫోన్లకు పని చెబుతున్నారు. ప్రతి చిన్న విషయాన్ని వాట్సాప్, ఫేస్‌బుక్, సెల్‌ఫోన్ మేసేజ్‌ల ద్వారా చేరవేస్తున్నారు. వీటి వినియోగం పెరగడంతో లేఖ మరుగున పడిపోయింది. నేటి తరానికి వాటి గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది.
– అన్నెం శ్రీనివాసరెడ్డి, కవి రచయిత, నంద్యాల

అదో తీపి గుర్తు



మనలోని భావాలు, ఎదుటి వారికి నేరుగా చెప్పలేని విషయాలను ఉత్తరాల ద్వారా చక్కగా వ్యక్తీకరించవచ్చు. ఉత్తరం ఓ మధుర జ్ఞాపకం. మన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు.. ఎవరికి రాసినా అదొక తీపి గుర్తు. లేఖ రాయడం, చదవం భాషపై పట్టు పెంచుతాయి. ఈ విషయాన్ని నేటితరం యువత గుర్తించి మళ్లీ ఉత్తరాలు రాసే సంస్కృతి తీసుకురావాలి.
– శివన్న, విశ్రాంత ఉద్యోగి, నంద్యాల

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రోత్సవాలు



దొర్నిపాడులో లలితాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఉయ్యాలవాడలో చాముండేశ్వరి అలంకారంలో అమ్మవారు



రుద్రవరం: ఎల్లావత్తులలో మహ చండీ అలంకారంలో అమ్మవారు



ఆళ్లగడ్డలో తోటోత్సవానికి ఊరేగింపుగా వెళ్తున్న అమ్మవారు,



శిరివెళ్ల: స్కందమాతా దేవీగా అమ్మవారు

దసరా ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, పూజలు నిర్వహిస్తున్నారు. దొర్నిపాడులో అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో చౌడేశ్వరిదేవిగా పూజలందుకున్నారు. చాగలమర్రిలో అన్నపూర్ణదేవిగా భక్తులను కటాక్షించారు. అలాగే రుద్రవరంలో గౌరీ దేవిగా, ఎల్లావత్తులలో మహాచండీగా, శిరివెళ్లలో స్కందమాతగా, ఆళ్లగడ్డలో లలితాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు.
– సాక్షి నెట్‌వర్క్

శ్మశాన వాటికలకు స్థలాలు అన్వేషించండి

- 200 రోజుల ప్రణాళిక లక్ష్యాలను సిద్ధం చేయండి
- ఏపీ సేవా సర్వీసులను క్లియర్ చేయండి
- స్వర్ణాంధ్ర- 2047 క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): జిల్లాలో అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థల సమస్య ఉందని, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి స్థలాలను అన్వేషించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులు, మండల స్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్మశాన వాటికల స్థల కేటాయింపుపై 2023లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినప్పటికీ పరిష్కారం చూపలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న 60 చెత్త సంపద తయారీ కేంద్రాలకు కూడా స్థలాలను గుర్తించాలన్నారు. ఏపీ సేవా సర్వీసుల కింద 1,753 దరఖాస్తులు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లాయని జిల్లా అధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. రెవెన్యూలో 1208, పోలీస్ శాఖలో 184, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో 90 తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఏపీ సేవా సర్వీసులను రెండు రోజులలో క్లియర్ చేయాలని స్పష్టం చేశారు.200 రోజుల కార్యాచరణ ప్రణాళికా లక్ష్యాల సాధనపై దసరా పండుగ తర్వాత ప్రతివారం సమీక్షిస్తానని ఇందుకు సంబంధించి నివేదికలో పొందుపరిచిన విధంగా పురోగతి చూపాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ద్వారా రూ.90 కోట్ల పనులకు సంబంధించి పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేశామని, ఈనెల 14 నుంచి 21 తేదీలోగా రోడ్లు, డ్రైన్లు, తదితర నిర్మాణ పనులకు సంబంధిత ప్రజాప్రతినిధులతో శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పనుల ప్రగతిపై ప్రతి బుధవారం సమీక్షిస్తానని చెప్పారు. ఉపాధి హామీ కింద ప్రభుత్వం కేటాయించిన నిధులను ఫిబ్రవరి నెలాఖరులోగా ఖర్చు చేయాల్సి ఉందని, ప్రతిపాదించిన పనులను వేగవంతం చేయడంతో పాటు లేబర్ మొబిలైజేషను పెంచాలన్నారు. స్వర్ణాంధ్ర - 2047 దార్శనిక రూపకల్పనకు అన్ని వర్గాల ప్రజల నుంచి క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా అభిప్రాయాలు సేకరించాలన్నారు. అన్ని జిల్లాలలో లక్ష, లక్షన్నరకు పైగా ఫీడ్‌బ్యాక్ సేకరించారని, మన జిల్లాలో 60వేలు మాత్రమే సేకరించారని తెలిపారు. 97 శాతం మాత్రమే ఈ–పంట నమోదైందని మిగిలిన మూడు శాతం త్వరితగతిన పూర్తి చేసి ఈ–కేవైసీను ప్రక్రియను ముగించాలన్నారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, సోయాబీన్ పంట నష్ట వివరాలను అందజేయాలని చెప్పారు.

పరిహారం పంపిణీ..

ఈ ఏడాది ఆగస్టు 30, 31 తేదీల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహాలకు నష్టపరిహారం అందించామని, సాంకేతిక కారణాల వల్ల పరిహారం అందని బాధితులకు నగదు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టర్‌లోని సెంటనరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా నష్టపరిహారం అందని పదిమంది బాధితులకు రూ.లక్ష నగదును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాలకు దెబ్బతిన్న 331 గృహాలు దెబ్బతినగా 321 మంది ఖాతాల్లో పరిహారం జమ కాగా.. మిగిలిన 10 మందికి సాంకేతిక కారణాలతో అందకపోవడంతో ప్రభుత్వం కలెక్టర్ల ఖాతాల్లో వేసి అందజేయాలని ఆదేశించిందని, దీంతో ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున పంపిణీ చేశామని వివరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్‌ఓ పద్మజ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

నంద్యాల (న్యూటౌన్): జిల్లాలో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని, క్వింటాకు రూ.3 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని, మార్క్‌ఫెడ్ ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులపాలువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. దళారులను అరికట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెలుగోడు మండలంలో మొక్కజొన్న పంటకు కాపలాగా ఉంటూ, పిడుగు పడి మృతి చెందిన యువ రైతు శివగంగాధర్ రావు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు. జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గసభ్యులు రాధాకృష్ణ, నాగరాముడు, భాస్కర్, మోటారాముడు, సీనియర్ నాయకుల సంజీవులు. జిల్లా సమితి సభ్యులు డి శ్రీనివాసులు.భార్గవ్,బాలకృష్ణ, మహిళా సంఘం నాయకురాళ్లు లక్ష్మీదేవి, రజిత,సుశీలమ్మ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొమ్మ చెట్టు స్థలాన్ని కాపాడండి

- హిందువుల పవిత్ర స్థలం టీడీపీ నాయకుడి పరం
- తప్పుడు సర్వే నంబర్లతో ఆక్రమించి కాంప్లెక్స్ నిర్మాణం
- అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



కబ్జా స్థలంలో నిర్మిస్తున్న కాంప్లెక్స్

నంద్యాల(అర్బన్): హైందవులు పవిత్రంగా భావించి పూజించే పాలకొమ్మ చెట్టు స్థలాన్ని తెలుగుదేశం పార్టీ కబ్జాదారుల నుంచి కాపాడాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు రవికిరణ్ మాదిగ కోరారు. సర్వే నంబరు 841 స్థలాన్ని తప్పుడు సర్వే నంబర్లతో చూపించి టీడీపీ నాయకులు చెట్టుకొమ్మను నరికి కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రవికిరణ్ మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన పాలకొమ్మ చెట్టు స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం దారుణమన్నారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతోనే కబ్జాదారులు స్థలానికి అనుమతులు తెచ్చుకొని కోట్ల రూపాయలు విలువ చేసే పాలకొమ్మ చెట్టు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని మండిపడ్డారు. గతంలో మాదిగలు చెప్పు కుట్టుకునేందుకు జీవనోపాధిగా ఉన్న పాలకొమ్మ చెట్టు స్థలం కబ్జాకు గురికావడం అన్యాయమని, స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడకపోతే ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. జిల్లా మంత్రులు, ఎంపీ, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు జోక్యం చేసుకోవాలని కోరారు.

హోరా హోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు



విజయం సాధించిన జట్టు

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలో 42వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరగుతున్నాయి. సోమవారం బాలుర టీంలో కర్ణాటక, గుజరాత్ తలపడగా కర్ణాటక విజయం సాధించింది, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్ మధ్య జరిగిన పోటీలో హిమాచల్ ప్రదేశ్ 4–3 తేడాతో విజయకేతనం ఎగరవేసింది. బాలికల పోటీల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌పై ఢిల్లీ విజయం సాధించింది. బీహార్‌పై మధ్యప్రదేశ్ 4–3 తేడాతో విజయంగా సాధించగా.. ఈ విభాగంలో ప్రీ క్వాటర్ ఫైనల్‌కు తెలంగాణ, చండీఘర్, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, హిమాచల ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ చేరాయి. బాలుర విభాగంలో రాజస్థాన్, బిహార్, తెలంగాణ, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జమ్ము కాశ్మీర్, తమిళనాడు, మహారాష్ట్ర, చండీఘర్, ఛత్తీస్‌ఘడ్, కర్ణాటక క్వాటర్ ఫైనల్ చేరినట్లు రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. అంతకుముందు రామకృష్ణారెడ్డి, మౌలాలి రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బద్రీనాథ్ నారాయణ, మహారాష్ట్ర శ్యామ్ సుందర్ శర్మ, శృతి పటేల్, వికాస్ పాండే, పృథ్వీరాజ్, లోకేష్, శివ, లక్ష్మీ, కర్నూలు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

గోస్పాడు: ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి స్వప్నికారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలానికి 351 క్వింటాళ్ల జేజీ–11 రకం శనగ విత్తనాలు ప్రభుత్వం కేటాయించిందని, మంత్రి ఫరూక్ సోమవారం విత్తనాలు పంపిణీ చేశారని తెలిపారు. పసురపాడు, తేల్లపురి, జూలేపల్లె, గోస్పాడు, ఒంటివెలగల, ఎం.కృష్ణాపురం గ్రామాలకు విత్తనాలు మంజూరయ్యాయన్నారు. 20 కేజీల బస్తాకు రూ.1410 చెల్లించాలని, ఎకరాకు 2 బస్తాలు చొప్పున 5 ఎకరాలకు 10 బస్తాలు వరకు ఒక్కో రైతుకు అందజేస్తామని చెప్పారు. విత్తనాలు కావలసిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు.

అందుబాటులో ఎరువులు

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల సహకార సంఘంలో రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని సీఈఓ సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20:20:0:13, 10:26:26, యూరియా, పొటాష్ తదితర ఎరువులు ఉన్నాయని, కావాల్సిన రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి ఎరువులను తీసుకెళ్లాలన్నారు.

ఎరువుల కొరత రానివ్వం

ఉయ్యాలవాడ: రబీ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తామని ఏఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రబీపైనే కోటి ఆశలు.. అందుబాటులో లేని ఎరువులు శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మాయలూరు, అల్లూరు, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె రైతు సేవా కేంద్రాలలో 50 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు నిల్వ చేసి, మరో రెండు రోజుల్లో 60 మెట్రిక్ టన్నుల డీఏపీ, యూరియా మండలానికి రానున్నట్లు ఏఓ తెలిపారు.

ప్రశాంతంగా టెట్ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజీలో టెట్ ఎస్‌జీటీ పేపర్–1ఏ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం పరీక్షకు 160 మందికి గాను 139 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారన్నారు. ఎస్‌ఏ–2 మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 61మందికి గాను 56 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీన రాజీవ్‌గాంధీ మెమోరియల్ కాలేజీ నెరవాడ, ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీల్లో టెట్ పరీక్ష ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో హాజరు కావాలని సూచించారు.

నిర్భయంగా దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న సీఐ తాఖీబాషా

ఉయ్యాలవాడ/దొర్నిపాడు: మద్యం షాపుల నిర్వహణ కోసం నిర్భయంగా దరఖాస్తులు చేసుకోవచ్చని కోవెలకుంట్ల ఎక్సైజ్ సీఐ తాఖీబాషా సూచించారు. సోమవారం ఆయన ఉయ్యాలవాడ, దొర్నిపాడు పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఆయా చోట్ల సీఐ మాట్లాడుతూ కోవెలకుంట్ల ఎక్సైజ్ పరిధిలో 11 షాపులకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కోవెలకుంట్ల 5, సంజామల 4, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 24 దరఖాస్తులు అందాయన్నారు. ఈనెల 9న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు. 11వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో లక్కీ డిప్ ద్వారా దుకాణాలు కేటాయించనున్నట్లు తెలిపారు. షాపు దక్కించుకున్న యజమాని రూ.9,16,700 వెంటనే చెల్లించి లైసెన్స్ పొందాలన్నారు. రూ.55 లక్షల్లో మిగిలిన సెక్యూరిటీ డిపాజిట్ దశల వారీగా చెల్లించాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ప్రవీణ్‌నాయక్ ఉన్నారు.

